


*(గత సంచిక తరువాయి)*

"1935లో మహామాయ మజిలీలు అనే పుస్తకం రాసారు."

"మీ దగ్గర ఆ బుక్ ఉందా?"

"మా అమ్మ పోయాక ఆమె పెట్టెలో దొరికింది. అది చూసి భలే థ్రిల్ అయ్యాం."

"సో..మీరు నాయుడూస్ అన్నమాట."

"అవును. కానీ నాకు చాలా `డోన్ట్ డూస్` కూడా ఉన్నాయి."

"ఉదాహరణకి?"

"ఆ జాబితాలో మొదటిది ఇంటర్నెట్ ఛాటింగ్‌లో కలిసిన మగాళ్ళు `ఓసారి కలుద్దామా?` అంటే `నో` అనడం." స్మైలీ పంపింది.

ముందు రాక్షసి బొమ్మని పంపాడు. తర్వాత రెండు స్మైలీ బొమ్మల్ని పంపాడు.

"మీ ఫేవరేట్ ఆథర్ ఎవరు?" అడిగాడు.

"హెన్రీ జేమ్స్. ఆయన షార్ట్ స్టోరీస్ నాకు చాలా ఇష్టం. అఫ్‌కోర్స్. కలలరాణి యుద్దనపూడి సులోచనారాణి, ఇంటలెక్చువాలిటీకి పని పెట్టే వీరేంద్రనాథ్‌ల రచనలు కూడా నాకు బాగా ఇష్టం. బై గుడ్‌నైట్."

"బై ది బై కాబోయే మీ భర్త ఎలా ఉండాలని మీ ఆలోచన?"

"అతను అనాథ అయి ఉంటే బెటర్."

"ఎందుకని?"

"అత్తమామలు, ఆడపడుచుల బెడద ఉండదని."

వాక్యం చివర స్మైలీ బొమ్మ ఉంది.

అలా పావుగంటసేపు వారి సంభాషణ సాగాక చెప్పింది స్ఫూర్తి.

"టైమ్ టు సైనాఫ్. గుడ్‌నైట్."

సైనాఫ్ అయ్యాక త్రివిక్రం యూ ట్యూబ్‌లోకి వెళ్ళి బేబీస్ స్మైల్స్ అని టైప్ చేసి చిన్నపిల్లలకి చెందిన తమాషా వీడియోలని కాసేపు చూసాడు. నవ్వే పిల్లల షార్ట్ వీడియోస్‌ని కొన్నిటిని చూసి అనుకున్నాడు.

పాశ్చాత్యులకి ఎంత శ్రద్ధ? భారతీయుల్లో ఇలాంటి ఆసక్తి తక్కువ. ఇలా తమ పిల్లల్ని వీడియో తీసి యు ట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేస్తే ప్రపంచం అంతా చూస్తుంది కదా?

అతని ఆలోచనలు తన భౌతిక తండ్రి మీదకి మళ్ళాయి. అతను ఎవరై ఉంటారు? హరినాథా? కురంగేశ్వరా? అలెగ్జాండరా? నవనీతా? ఈ నలుగురిలో ఎవరై ఉండచ్చు? మిత్రులతో ఆల్కహాల్ మత్తులో తన వల్ల గర్భవతైన ప్రమీలకి పుట్టిన తను ఆయన కొడుకని తెలిస్తే ఎలా ఫీలవుతాడు? కొడుకు మీద తండ్రికి ఉండే సహజ ప్రేమ తనమీద ఆయనకి కలుగుతుందా? లేక ఉదాశీనంగా ఉంటాడా? తన తండ్రి అసలు ఇంకా బతికే ఉన్నాడా? రకరకాల ఆలోచనల మధ్య పావుగంటలో త్రివిక్రంకి నిద్రపట్టింది.

10

చెప్పినట్లుగానే మర్నాడు ఉదయం శ్యామలరావు త్రివిక్రం ఇంటికి వచ్చాడు.

"మా అమ్మ గురించిన ఓ ముఖ్యమైన విషయం మీకు ఇంతదాకా చెప్పలేదు. నేను మా అమ్మకి జన్మించలేదు. నా తల్లి పేరు ప్రమీల."

త్రివిక్రం చెప్పేది శ్యామలరావు ఆశ్చర్యంగా విన్నాడు. మొత్తం విన్నాక అతను చెప్పిన వివరాలు రాసుకున్నాడు. కర్నూలుకి వెళ్ళి రావడానికి, హోటల్ ఖర్చులకి అతని వెయ్యి రూపాయల నోటు ఇచ్చాడు త్రివిక్రం.

తనకి వివరాలు తెలియగానే అక్కడ నించే ఫోన్ చేసి చెప్తానని చెప్పాడు శ్యామలరావు.

మంగళవారం ఉదయం పదకొండున్నరకి త్రివిక్రం సెల్‌ఫోన్ మోగింది. అది శ్యామలరావు నించి. వెంటనే కట్ చేసి తనే ఆ నెంబర్‌కి ఫోన్ చేసాడు త్రివిక్రం.

"హలో సార్ నిన్న రాత్రి తొమ్మిదిన్నరకి కర్నూలు వచ్చాను. ఇప్పుడే కలెక్టరేట్‌కి వచ్చాను. ఇక్కడ పని చేసిన మరియమ్మ గురించి ఎంక్వైరీ చేసాను. మీ ఊహ కరెక్టే. ఆవిడ ఏడేళ్ళ క్రితం యు.డి.సిగా రిటైరైంది. నిజానికి ఆమె రిటైరయ్యేనాటికి ఉన్న సిబ్బందిలో ఎవరూ లేరు. రిటైరైపోయారు. గుమస్తాగా పని చేసి ఏడాది క్రితం రిటైరైపోయిన బల్వంతరావు అనే ఒకాయన పెన్షన్ పనిమీద లక్కీగా ఇవాళే కలెక్టరేట్‌కి వచ్చాడు. ఆయనకి మరియమ్మ తెలుసు. ఆవిడని చూసి అయిదారేళ్ళయిందిట."

"ఇప్పుడు ఎక్కడుందని చెప్పాడు?"

"తెలీదన్నాడు. మీరు చెప్పిన బనగానపల్లె ఆమె స్వగ్రామం. అక్కడ బ్రహ్మంగారి మఠం ఉందిట. దాని పరిసరాల్లోని గ్రామదేవత గుడి పక్క సందులోని పెంకుటిల్లని ఆయన చెప్పాడు. బనగాన పల్లెకి వెళ్ళబోతూ మీకు ఇవి చెప్దామని ఫోన్ చేసాను."

"అక్కడికి ఎంత దూరం?"

"సుమారు అరవై కిలోమీటర్లు."

"భోజనం చేసి బయలుదేరండి."

"బస్ స్టాండ్‌కి వెళ్తాను. బస్ సిద్ధంగా ఉంటే ఎక్కేస్తాను. మళ్ళీ బస్సు ఎప్పుడు ఉంటుందో? ఒక వేళ బస్‌కి టైమ్ అంటే భోజనం చేస్తాను. లేదా బనగానపల్లెలోనే తింటాను."

"అది చిన్న ఊరు. అట్టే మంచి హోటళ్ళు ఉండకపోవచ్చు" హెచ్చరించాడు త్రివిక్రం.

"ఎంత చిన్న ఊరైనా పళ్ళయితే దొరుకుతాయి కదండి. అక్కడికి వెళ్ళాక ఫోన్ చేస్తాను."

"థాంక్స్. మీకు శ్రమ ఇస్తున్నాను."

"అదేం లేదు. నాకూ ఈ ఊళ్ళు చూసినట్లుగా ఉంటుంది. కర్నూలు ఇంత పెద్ద ఊరని అనుకోలేదు నేను."

"సరే బనగానపల్లె వెళ్ళి విషయాలు తెలిసాక మళ్ళీ మిస్డ్‌కాల్ ఇవ్వండి. వెంటనే నేను ఫోన్ చేయకపోతే ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నట్లు."

"అలాగే సార్."

త్రివిక్రంకి అనిపించింది మరియమ్మ జీవించి ఉందో లేదో అని. జీవించే ఉండాలని, లేదా అలెగ్జాండర్ గురించి తెలిసిన వారెవరైనా శ్యామలరావుకి తారసపడాలి అని దేవుడిని ప్రార్థించాడు.

ఆ ఉదయం వరసగా రెండు టాన్సిల్స్ ఆపరేషన్స్ చేసాడు త్రివిక్రం. బయటికి వచ్చాక ముందు వేడి వేడి కాఫీ తాగాడు. తర్వాత గుర్తొచ్చి ఆఫ్ చేసిన తన సెల్‌ఫోన్‌ని స్విచ్చాన్ చేసి శ్యామలరావుకి ఫోన్ చేసాడు.

బనగానపల్లెలో బస్ దిగిన శ్యామలరావు బయటికి వచ్చాడు. పక్కనే ఉన్న పోస్ట్ బాక్స్‌లో ఉత్తరాలని తీసే ఓ ఉద్యోగి కనిపించాడు. అతన్ని అడిగాడు.

"ఈ ఊళ్ళో గ్రామదేవత గుడి ఎక్కడ?"

ఎలా వెళ్ళాలో చెప్పాడు. శ్యామలరావు ఆ ఊరిని చూసుకుంటూ నడిచే వెళ్ళాడు. గుడి పక్కనించి వెళ్తూంటే, గ్రామదేవత గుడితలుపులు మూసి ఉండటంతో బయటనించే ఓ నమస్కారం చేసాడు. తనకి తెలిసిన గుర్తుల ప్రకారం మరియమ్మ ఇంటిని తేలిగ్గానే కనుక్కున్నాడు. ఓ సన్నటి సందులోని ఆ ఇంటి తలుపు వేసి ఉంది. కిటికీలోంచి హార్మోనియం వినిపిస్తోంది. రాగయుక్తంగా పౌరాణిక పద్యం కూడా. 'పీటర్' అనే పేరున్న బోర్డు కనిపించింది. శ్యామలరావు తలుపు తట్టాడు.

కొద్దిసేపటికి ఓ పదకొండేళ్ళ పిల్లవాడు తలుపు తీసి శ్యామలరావుని చూసి అడిగాడు.

"ఎవరు కావాలి?"

గోడకి వేలాడే చెక్క శిలువని, మేరీమాత, బాలక్రీస్తు బొమ్మలని చూసి తను సరైన ఇంటికే వచ్చాననుకున్నాడు శ్యామలరావు.

"మరియమ్మగారిల్లేనా ఇది?"

"మరియమ్మ? ఉండండి" లోపలికి వెళ్ళాడు.

స్టేజి మీద నాటకాల్లో నటిస్తున్న ఒకతని ఫోటోలు, కొన్ని షీల్డ్‌లు చూసాడు. ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతుల మీదుగా బహుమతి అందుకునే ఫోటో ఒకటి వాటిలో ఉంది. ఓ నిమిషం తర్వాత ఓ మధ్య వయస్కుడు బయటికి వచ్చి అడిగాడు.

"ఎవరు కావాలి?"

"మరియమ్మ. కర్నూలు కలెక్టరేట్‌లో పని చేసి రిటైరయ్యారు. అక్కడ అడిగితే ఈ అడ్రస్ చెప్పారు."

"రండి" ఆహ్వానించాడాయన.

శ్యామలరావు లోపలికి వెళ్ళి పేము కుర్చీలో కూర్చున్నాడు.

"కర్నూలులో ఎక్కడ మీరుండేది?" అడిగాడు అతన్ని.

"నాది కర్నూలు కాదు. హైదరాబాద్ నించి వస్తున్నాను."

"ఏం చేస్తారు?"

"మార్గదర్శి చిట్స్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్ని."

"నాకు తెలిసి మరియమ్మ ఎన్నడు చిట్టీ కట్టలేదే?"

"అబ్బే. నేను ఆఫీస్ పని మీద రాలేదు. పర్సనల్ పనిమీద వచ్చాను. ఆవిడమీకేమవుతారు?"

"ఏం కారు. ఈ ఇంట్లో అద్దెకి ఉంటున్నాం."

"ఆవిడ ఎక్కడ ఉంది?"

"మీకు తెలీదా? మరియమ్మ పోయి నాలుగేళ్ళయింది."

"అరెరె. ఆవిడ కొడుకు అలెగ్జాండర్?"

"ఆయనే మాకు ఈ ఇంటిని అద్దెకి ఇచ్చింది. ఆయన ఇక్కడ ఉండడు. పీ యాలేరులో ఉంటారు."

"ఎక్కడుందది?"

"అనంతపురం జిల్లా, ఆత్మకూరు మండలం. ఆయన అడ్రస్, ఫోన్ నెంబర్ ఉన్నాయి. కావాలంటే రాసిస్తాను."

ఆయన లోపలికి వెళ్ళి కొద్దిసేపటి తర్వాత ఓ కార్డ్ ఇచ్చాడు.

"ఇది శుభలేఖ" చెప్పాడు శ్యామలరావు దాన్ని చూసి.

"దాని వెనక రాసాను." చెప్పాడు పీటర్. తిప్పి చూస్తే అందమైన చేతిరాతలో ఓ చిరునామా, ఫోన్ నెంబర్ ఉన్నాయి.

"మరియమ్మతో మీకేం పనో చెప్పనే లేదు?" అడిగాడు అతను.

"గాంధీ హాస్పిటల్‌లో పని చేసే ఓ డాక్టర్ గారు మరియమ్మ లేదా అలెగ్జాండర్‌లు ఎవరితోనైనా ఫోన్‌లో మాట్లాడించమని నన్ను పంపారు. పనేమిటో నాకు తెలీదు." నిజం చెప్పడం ఇష్టంలేక చెప్పలేదు శ్యామలరావు

అతనేం ఇంకేం మాట్లాడలేదు.

ఆయన దగ్గర సెలవు తీసుకుని గుడి పక్కనించి వెళ్తూంటే, అది తెరచి ఉండటం చూసాడు. లోపలికి వెళ్ళి గ్రామదేవతకి దణ్ణం పెట్టుకున్నాడు. పూజారిని బ్రహ్మంగారి మఠం గురించి ఎంక్వైరీ చేసి అక్కడికి వెళ్ళాడు. పూర్వం బ్రహ్మంగారు ఉన్న ఇల్లు, ఆయన ధ్యానం చేసుకున్న గది మొదలైనవి చూసాడు. బ్రహ్మంగారు సమీపంలోని అడవికి పశువులని తోలుకు వెళ్ళి యాగంటిలోని ఓ గుహలో కాలజ్ఞానం రాసారని, ఆ తాళపత్ర గ్రంథాలు ఆ ఇంటి లోగిలిలోని ఓ మర్రిచెట్టు కింద పాతిబెట్టబడి ఉన్నాయని ఎవరో చెప్పారు.

శ్యామలరావు అక్కడ నించి తిరిగి బస్ స్టాండ్‌కి చేరుకున్నాడు. గంటన్నర వేచి ఉన్నాక కర్నూలు బస్ వచ్చింది. బస్సెక్కిన కొద్ది నిమిషాలకి శ్యామలరావు సెల్‌ఫోన్ మోగింది. చూస్తే అది త్రివిక్రం నించి.

శ్యామలరావు మర్నాడు ఉదయం త్రివిక్రం ఇంటికి వెళ్ళాడు. తను ఫోన్‌లో చెప్పిన విషయాలే మరోసారి చెప్పి అలెగ్జాండర్ అడ్రస్ ఉన్న ఆ శుభలేఖని ఇచ్చాడు.

"ఈ ఆదివారం నేనే ఆయన దగ్గరకి వెళ్తాను. చాలా థాంక్స్" చెప్పాడు త్రివిక్రం.

తనకైన ఖర్చులు పోను వెయ్యిలో మిగిలింది త్రివిక్రంకి ఇచ్చేసాడు. త్రివిక్రం అదనంగా ఇస్తున్న వెయ్యి రూపాయలు శ్యామలరావు తీసుకోలేదు.

"వద్దండి. నేను ఫ్రెండ్లీగా మీకే సహాయం చేసాను. డబ్బు ఆశించికాదు." చెప్పాడు.

"ఈ రోజుల్లో శ్యామలరావుగారి లాంటివారు అరుదు. మీ పెళ్ళికి అతనికి బట్టలు పెట్టండి." అతను వెళ్ళాక సలహా ఇచ్చాడు సుందరేశ్వర్.

"మంచి ఆలోచన. అతని ఋణం అలా తీర్చుకుంటాను." చెప్పాడు త్రివిక్రం.

రెండుసార్లు అలెగ్జాండర్ నెంబర్‌కి ఫోన్ చేసాడు. కాని స్విచ్ఛాఫ్ చేసి ఉండటం లేదా అవుటాఫ్ కాలింగ్ ఏరియా అని జవాబు వచ్చింది.

ఆత్మకూర్‌కి రైల్వే టిక్కెట్ తీసుకుందామని ఇంటర్నెట్‌లోని రైల్వే సైట్‌లోకి వెళ్ళి చూస్తే శనివారానికి ఒక్క ఖాళీ కూడా లేదు. తత్కాల్‌లో టిక్కెట్ దొరికింది.

త్రివిక్రం తమ హాస్పిటల్‌లో పని చేసే ఆత్మకూరుకి చెందిన ఓ నర్స్‌ని పీ యాలేరు గురించి ఎంక్వైరీ చేసాడు.

"దాని పేరు పడమటి యూలేరు సార్. కానీ పీ యాలేరు అంటారు. ఆ గ్రామానికో విశేషం ఉంది. అక్కడివారంతా చదువుకున్నవారే. గ్రామంలోని వారిలో సగం మందికి పైగా పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. నలుగురు అమెరికాలో ఉన్నారు. డెబ్భై ఏళ్ళ వయసున్న వాళ్ళకి కూడా చదువు వచ్చు. ఎందుకంటే నైన్టీన్ థర్టీ నించే అక్కడి ప్రజలకి చదువు మీద మక్కువ ఏర్పడింది. నిరక్షరాస్యత లేని గ్రామం అది. చదువే ఆ గ్రామస్థుల జీవితాశయం. అక్కడ మీకేం పని?" అడిగింది.

"అలెగ్జాండర్ అని ఒకాయన్ని కలవాలి. మీకు తెలుసా ఆయన?"

"లేదు" జవాబు చెప్పింది ఆమె.

అనంతపూర్‌లో రైలు దిగి తన టూర్ టైర్ ఏ.సి టిక్కెట్‌ని చూపించి రిటైరింగ్ రూంలో త్రివిక్రం స్నానం చేసాడు. ఎయిర్ బేగ్‌లోని ఓ జత బట్టలని తీసి తొడుక్కున్నాడు. రిక్షాలో బస్‌స్టాండ్‌కి చేరుకున్నాడు. అక్కడి నించి పడమటి యాలేరుకి వెళ్ళే బస్సు అరగంట తర్వాత వచ్చింది.

బస్సు దిగాక ఆరోగ్య మాత చర్చి ఎక్కడని ఒకరిని అడిగాడు.

"ప్రార్థనకా?"

"కాదు. చర్చి పక్కనే ఉన్న ఒకరింటికి వెళ్ళాలి."

"ఎవరింటికి?" ఎదురు ప్రశ్న వేసాడతను.

"అలెగ్జాండర్‌ని కలవాలని వచ్చాను."

"అలెగ్జాండర్ ఇక్కడ ఉండటం లేదనుకుంటాను. ఆయన ఆరోగ్యం బాగాలేదుగా? ఆయన అక్కపేరు వేలాంగిణి. ఆవిడకి అన్ని విషయాలు తెలుస్తాయి." ఎడ్రస్ చెప్పాడు అతను.

అట్టే దూరంలో లేని ఆరోగ్య మాత చర్చి వెనక ఉన్న చిన్న పూరింటికి త్రివిక్రం వెళ్ళాడు. తలమీద కొంగుని కప్పుకుని ప్రార్థన చేస్తున్న వేలాంగిణి వయసు అరవై పైనే ఉంటుంది. ఆవిడ అలెగ్జాండర్ పెద్దమ్మ కూతురు. అలెగ్జాండర్ గురించి అడగ్గానే కొంగుని తీస్తూ జవాబు చెప్పింది.

"ఆరోగ్యం బాగా పాడై కర్నూలు హాస్పిటల్‌లో ఉన్నాడు. మీరెవరు?"

త్రివిక్రం తను వచ్చిన పనిని ఓ నిమిషంలో వివరించాడు. ఆవిడ మొహంలో ఎలాంటి ఆశ్చర్యంలేదు.

"అలాగా" అని మాములుగా చెప్పింది.

"ఆయనకి ఏమైంది?" అడిగాడు.

"ప్రాణం బాగాలేదు. కాళ్ళన్నీ వాచాయి."

"ఏ హాస్పిటల్‌లో ఉన్నారు?"

"గవర్నమెంట్ హాస్పిటల్‌లో. మా ఊరి డాక్టరే భీం శంకర్ కర్నూలులో పని చేస్తున్నారు ఆయన ఉన్నాడన్న ధైర్యంతో పదిరోజుల క్రితం అక్కడకి వెళ్ళాడు."

సెలవ తీసుకుని బయలుదేరబోతున్న అతన్ని ఆగమని చెప్పింది.

"చిల్లర నాణాలని, చిన్న నోట్లని నేను చాలాకాలంగా ముంతల్లో దాస్తున్నాను. అలా పధ్నాలుగేళ్ళుగా ముంతల్లోవి నేను వాడలేదు. మా ఇంటిముందున్న ఖాళీ స్థలాన్ని ఓ పుణ్యాత్ముడు చర్చి వాళ్ళ చేతుల్లో పెట్టిపోయాడు. కానీ అక్కడ చర్చి కట్టడానికి డబ్బుల్లేవు. అది తెలిసి నేనా ముంతలన్నిటినీ తీసుకుని పాస్టర్ దగ్గరకి వెళ్ళాను. అవన్నీ లెక్క చూస్తే అరవై ఏడువేల రూపాయలు జమయ్యాయి. అంటే

నాకు తెలీకుండానే నెలకి సుమారు నాలుగు వందలదాకా ఆదా చేసానన్నమాట. ఆ నాణాలని ఖర్చు చేసి ఉంటే, నేనింత పోగుచేసేదాన్ని కాను. నాకే ఆశ్చర్యం వేసింది అంత పోగయిందా అని. ఇది ఆదా చేయడానికి, ఇతరులకి సహాయం చేయడానికి మంచి పద్ధతి కాబట్టి నాకు తెలిసిన వాళ్ళందరికీ చెప్పి, వాళ్ళా స్మగతి మర్చిపోకుండా తలో ముంత ఇస్తున్నాను."

లోపలికి వెళ్ళి ఆమె రెండు ఖాళీ ముంతలని తెచ్చి త్రివిక్రంకి ఇచ్చింది. అప్పుడే ఆలోచన వచ్చినట్లు మళ్ళీ లోపలికి వెళ్ళి చిన్న చేతి సంచిని అవి వేసుకోవడానికి తెచ్చిచ్చింది. తనకి తెలిసిన మంచిని ఇతరులకి కూడా తెలియచెప్పాలనే ఆవిడ దృక్పథం అతనికి నచ్చింది. ఆవిడకి థాంక్స్ చెప్పి త్రివిక్రం బస్ స్టాండ్ వైపు నడిచాడు.

ఇందాక బస్ స్టాండ్‌లో కనపడ్డ వ్యక్తి మళ్ళీ దారిలో కనపడి అడిగాడు.

"అలెగ్జాండర్ ఉన్నాడా?"

"లేడు. కర్నూల్‌లో గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్పించారట."

"వేలాంగిణి మీకూ ముంతలిచ్చిందా?" అతని చేతి సంచిని చూసి నవ్వుతూ అడిగాడు.

తలూపాడు త్రివిక్రం.

"ఎప్పుడూ నెత్తిన కొంగు వేసుకుని ప్రభువు ప్రార్థనలో ఉంటుంది. మంచి భక్తురాలు. ప్రపంచం పట్టదు." చెప్పాడు అతను.

సోమవారం తను విధులకి హాజరు కాలేనని, ఆ ఒక్కరోజు సెలవు మంజూరు చేయమని ఆ రాత్రి త్రివిక్రం ఆత్మకూరు నించి గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌కి ఫాక్స్ పంపాడు. గంటన్నర తర్వాత ఆయన సెల్‌కి ఫోన్ చేస్తే, ఆయన సెలవు మంజూరు చేసానని చెప్పాడు.

ఆ రాత్రి ఆత్మకూరులో రైలెక్కి త్రివిక్రం తనకి రైలు టిక్కెట్ సికింద్రాబాద్ దాకా ఉన్నా, మర్నాడు తెల్లవారుఝామున దారిలో కర్నూలు రైల్వే స్టేషన్‌లో దిగాడు. రిటైరింగ్ రూంలో స్నానం చేసి దుస్తులు మార్చుకున్నాడు. తూర్పున వెలుగు వచ్చేదాకా కర్నూల్ రైల్వే స్టేషన్‌లోనే ఉండి తర్వాత బయటకి వచ్చాడు.

ఉదయం వాకింగ్‌కి వచ్చిన వాళ్ళని మంచి టిఫిన్ హోటల్ ఎక్కడుందని అడిగి తెలుసుకుని ఆ హోటల్‌కి చేరుకున్నాడు. టిఫిన్ తిని, కాఫీ తాగి అక్కడ నించి రిక్షాలో కర్నూలు ప్రభుత్వ హాస్పిటల్‌కి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ పెద్ద క్యూ ఉంది.

పేషెంట్లకి చీటీలు రాసిచ్చే డెస్క్ దగ్గరకి వెళ్ళి రిసెప్షనిస్ట్‌తో చెప్పాడు.

"నా పేరు త్రివిక్రం. నేను హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నాను."

హాస్పిటల్ జారీ చేసిన తన ఐడెంటిఫికేషన్ కార్డ్‌ని చూపించాడు.

"యస్సార్" అడిగాడతను.

"అలెగ్జాండర్ అనే రోగి పడమటి యాలేరు అనే గ్రామం నించి వచ్చి ఇక్కడ పదిరోజుల క్రితం అడ్మిట్ అయ్యాడు. అతను ఏ వార్డులో ఉన్నాడో చెప్పగలరా?"

"సారీ సర్. నా దగ్గర ఇన్ పేషెంట్ వివరాలు ఉండవు. ఇన్ పేషెంట్ వార్డ్ సిస్టర్లని ఎవరిని అడిగినా మీకు సహాయం చేయగలరు." అతను సూచించాడు.

'థాంక్స్' చెప్పి, త్రివిక్రం కేజువాలిటీ వార్డ్‌లోకి వెళ్ళి సిస్టర్‌కి ముందు తన ఐడెంటిటీ కార్డ్‌ని చూపించి, తర్వాత అలెగ్జాండర్ గురించి అడిగాడు.

"మా వార్డ్‌లో ఆ పేరుగల వారెవరూ లేరు డాక్టర్. అయినా మీరు ఓసారి వార్డ్‌లోకి వెళ్ళి అందర్నీ చూడండి" చెప్పిందామె.

"నేను ఇంతకు ముందు ఆయన్ని చూడలేదు. కాబట్టి గుర్తుపట్టలేను."

త్రివిక్రం మరి కొన్ని వార్డుల్లోకి వెళ్ళి ఎంక్వైరీ చేసాడు. ఏ వార్డ్ రికార్డుల్లో ఆయన పేరులేదు. కర్నూలు జనరల్ హాస్పిటల్‌లోని అన్ని వార్డులని ఒకటి రెండుసార్లు తిరిగి వైద్య సిబ్బందిని ప్రశ్నించాడు కానీ, అలెగ్జాండర్ పేరు గల వాళ్ళెవరూ రోగుల్లో లేరు. త్రివిక్రంకి ఏం చేయాలో పాలుపోలేదు. గత పదిరోజుల్లో అడ్మిట్ అయి, డిశ్చార్చి అయిన వాళ్ళ రికార్డుని కూడా చూసాడు. అందులో కూడా అలెగ్జాండర్ పేరు లేదు. 'ఏం చేయాలా?' అని ఆలోచిస్తుంటే అతన్ని ఎవరో పలకరించారు.

"త్రివిక్రం కదా మీరు?"

తల తిప్పి చూస్తే ఒకతను నవ్వుతూ కనపడ్డాడు. మెళ్ళో స్టెత్, తెల్ల దుస్తులు బట్టి అతను డాక్టర్ అని ఇట్టే గ్రహించాడు.

"గుర్తుపట్టలేదా? నేను మీ క్లాస్‌మేట్ అనిరుద్ధ్‌ని."

త్రివిక్రంకి అతనెవరో గుర్తురాలేదు. అయినా మర్యాదకి 'అవునవును. గుర్తొచ్చారు' అని పలకరించాడు.

"మీరేం చేస్తున్నారిప్పుడు?" అడిగాడతను.

"గాంధీ హాస్పిటల్‌లో సర్జన్‌గా పనిచేస్తున్నాను."

అనిరుద్ధ్ మరికొందరు సహ విద్యార్థుల పేర్లు చెప్పి, వారిలో ఎవరెవరు ఏమేం చేస్తున్నారో చెప్పాడు. అతను చెప్పిన చాలా పేర్లు త్రివిక్రంకి గుర్తురాలేదు. ఒకరిద్దరి పేర్లనే గుర్తుపట్టాడు. దినాధిపతి కాకినాడలో జనరల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నాడని చెప్పాడు.

"ఏమిటిలా వచ్చారు?" అడిగాడు అనిరుద్ధ్.

త్రివిక్రం తను వచ్చిన పని చెప్పాడు.

"అలెగ్జాండర్ ఈ హాస్పిటల్‌లోనే అడ్మిట్ అయి ఉండాలి. ఆయన్ని ఎలా ట్రేస్ చేయడం? ఏ వార్డులోనూ ఆయన లేడు. ఇప్పటికే రెండుసార్లు వార్డులన్నీ తిరిగి చూసాను."

అనిరుద్ధ్ కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పాడు.

"అడ్మిట్ కాని రోగులు చాలామంది ఈ ఆవరణలో అక్కడక్కడా ఉన్నారు. వాళ్ళల్లో ఉన్నారేమో చూసారా?"

"థాంక్స్. లేదు. చూస్తాను."

త్రివిక్రం ఆ హాస్పిటల్ ఆవరణలో చెట్లకింద అక్కడక్కడ కూర్చుని ఉన్న వాళ్ళ దగ్గరికి వెళ్ళి చూడసాగాడు. నడివయస్కులెవరైనా కనబడితే 'మీరు అలెగ్జాండరా?' అని అడగసాగాడు వారిలో అలెగ్జాండర్ లేడు. తర్వాత ఆ బిల్డింగ్ వెనక ఉన్న రోగుల దగ్గరకి కూడా వెళ్ళి అదే ప్రశ్నని వేసాడు. లేడు. అలా వెతుకుతూంటే హాస్పిటల్ సూపరింటెండెంట్ బిల్డింగ్ బయట కారిడార్‌లో కొందరు రోగులు కనబడ్డారు. వాళ్ళనీ అడిగాడు.

గళ్ళలుంగీ, మాసిన తెల్లటి పొడుగు చేతుల చొక్కా, చిన్న గోనెసంచీ మీద మూలుగుతూ పడుకుని ఉన్న ఓ వృద్ధుడ్ని చూసి ఆగాడు. తెల్లటి గడ్డంగల ఆయన మెళ్ళో వెండితో చేసిన శిలువని చూసాడు. ఆయన్నించి దుర్వాసన వస్తోంది. ఆయన దగ్గర ఆగి సందేహిస్తూనే అడిగాడు.

"మీరు అలెగ్జాండరా?"

"అవును. మీరెవరు?" బలహీనంగా చూస్తూ అడిగాడు ఆయన.

త్రివిక్రం ఆ సమాధానం ఎదురు చూడకపోవడంతో ఒక్కసారి అతని గుండె లయ తప్పింది.

"పడమటి యాలేరా మీది?" మళ్ళీ ప్రశ్నించాడు.

"అవును?"

"వేలాంగిణి మీ బంధువా?"

"అవును. మీరెవరో చెప్పనేలేదు?" మూలుగుతూనే అడిగాడు.

దీర్ఘంగా నిట్టూర్చాడు త్రివిక్రం. ఆయన పక్కన మోకాళ్ళ మీద కూర్చుని నెమ్మదిగా చెప్పాడు.

"నా పేరు త్రివిక్రం. మీరు ఇక్కడ ఎందుకు ఉన్నారు?"

"ఇక్కడ పనిచేసే డాక్టర్ భీంశంకర్ మా ఊరి వాడే ఆయన నాకు తెలుసు. ఒంట్లో బాగోలేకపోవడంతో నన్ను అడ్మిట్ చేసుకుంటాడని వచ్చాను. ఆయన ఇంగ్లాండ్ వెళ్ళారని ఎల్లుండి వస్తారని తెలిసి, వెనక్కి వెళ్ళే ఓపిక లేక ఆయన కోసం ఎదురు చూస్తూ ఇక్కడే ఉండిపోయాను."

"ఏమి మీ బాధ?" అడిగాడు త్రివిక్రం.

"నీరసం. కాళ్ళబాధ" మూలుగుతూ చెప్పాడు. దాదాపు ఏభై ఏళ్ళ వయసుగల అలెగ్జాండర్ చూడటానికి అరవైపైబడ్డ వాడిలా ఉన్నాడు.

త్రివిక్రం వృత్తిపరమైన ఆసక్తితో అక్కడక్కడ ఎండిన రక్తం మరకలు ఉన్న ఆయన లుంగీని మోకాళ్ళదాకా పైకి లాగాడు. ఇందాకటి వాసన గుప్పున గుప్పున కొట్టింది. ఆయన కాళ్ళమీద ఎక్కడా చర్మం లేదు. మాంసం కనబడుతోంది. లుకలుకమంటూ మేగోట్స్ (పురుగులు) మాంసంలో కనిపించాయి.

"గుడ్ గాడ్!"

"ఎల్లుండి ఆయన వచ్చేదాకా ఈ బాధ భరించాలి" చెప్పాడు అలెగ్జాండర్.

అటుగా వెళ్ళే ఒకతను ఆగి త్రివిక్రంని చూసి చెప్పాడు.

"ఈయనకి మీరు ఏమవుతారో కానీ ఈయన పరిస్థితి చూసి వార్డ్‌లో అడ్మిట్ చేసే ప్రయత్నం చేసాను సార్. కానీ అక్కడి సిబ్బంది బెడ్‌కి ఇచ్చే లంచం ముట్టకుండా అడ్మిట్ చేసుకోమన్నారు. ఈయనకి సహాయం చేయాలని నాకున్నా, డబ్బులేని నేను ఏం చేయలేకపోతున్నానని బాధగా ఉంది. పాపం యమ యాతన పడుతున్నాడు."

అతనివంక చూడగానే వైద్య కళాశాలలో చదువుతూ హౌస్ సర్జెన్సీ చేస్తున్న విద్యార్థి అని ఇట్టే గ్రహించాడు త్రివిక్రం.

"చెవిలో కానీ, ముక్కులో కానీ బయటి వస్తువులు వెళ్తేనే మనకి బాధగా ఉంటుంది. అలాంటిది మాంసంలో ఇన్ని మేగట్స్‌తో ఇతను ఎంత బాధపడుతున్నాడో" చెప్పాడతను జాలిగా.

దీర్ఘంగా నిట్టూర్చి లేచి చెప్పాడు త్రివిక్రం.

"ఈయన్ని అడ్మిట్ చేసేందుకు నేనూ ప్రయత్నం చేస్తాను. ఒకవేళ కుదరకపోతే హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌కి అంబులెన్స్‌లో తీసుకెళ్ళిపోతాను."

"ఐతే మీరు వీరికి కావాల్సిన వారన్నమాట. ఏదీ తేలేదాకా నేను మీ వెంబడే ఉంటాను సార్" అతను ఆనందంగా చెప్పాడు.

"మీ పేరు?"

"అహమ్మద్. మాది నందికొట్కూరు సర్."

త్రివిక్రం హాస్పిటల్ సూపరింటెండెంట్ దగ్గరకి వెళ్ళి తనని పరిచయం చేసుకుని ఐడెంటిటీ కార్డ్‌ని చూపించి చెప్పాడు.

"మా బంధువు క్రిటికల్ కండిషన్‌లో మీ గది పక్కనే వారం రోజులుగా ఉన్నాడు. దయచేసి ఆయన్ని అడ్మిట్ చేసుకునే సహాయం చేయగలరా?"

"వార్డ్‌లలో బెడ్స్ ఖాళీలు లేవు. ఉంటే అడ్మిట్ చేసుకునేవాళ్ళం. చూసారుగా? ఇంకా చాలామంది రోగులు బయట ఉన్నారు."

"కానీ అతని కాళ్ళల్లో మేగట్స్ ఫాం అయ్యాయి. భరించలేని బాధ పడుతున్నాడు."

"ఆ మేగట్స్ వల్ల వార్డ్‌లో లేని ఖాళీ మంచం ప్రత్యక్షమవుతుందా?" నవ్వుతూ ప్రశ్నించాడు సూపరింటెండెంట్.

అతను దొంగల రాజ్యానికి చెందిన లంచాల మనిషని ఆ సమాధానంతో ఇట్టే గ్రహించాడు. త్రివిక్రం ఆ క్షణమే అలెగ్జాండర్‌ని తన వెంట హైదరాబాద్‌కి తీసుకు వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాడు.

"థాంక్స్ ఫర్ యువర్ కో ఆపరేషన్ సర్. ఇదే మీకు కావలసిన రోగి అయితే ఇప్పటికిప్పుడు హాస్పిటల్‌లో మీ కోసం ఓ ఖాళీ బెడ్ ప్రత్యక్షం కాకపోతేనే నేను ఆశ్చర్యపోతాను."

ఆయన మొహం ఎర్రబడింది. త్రివిక్రం బయటకి నడిచాడు.

"అహమ్మద్! హైదరాబాద్‌కి అంబులెన్స్‌ని మాట్లాడాలి. కెన్ యూ హెల్ప్ మీ?" బయట నిలబడి ఉన్న అతన్ని అడిగాడు.

తల ఊపి, అతను తన సెల్‌ఫోన్ నించి ఎవరికో ఫోన్ చేసి త్రివిక్రం కోరింది చెప్పాడు. అవతలి వైపు నించి చెప్పింది త్రివిక్రంకి చెప్పాడు. సగం డబ్బు ముందు ఇవ్వాలి. సగం హైదరాబాద్ చేరాక. త్రివిక్రం ఏటియంలో కొంత కేష్ డ్రా చేసాడు. ఇద్దరు వెళ్ళి అంబులెన్స్ కంపెనీకి దాన్ని చెల్లించి గంట తర్వాత అంబులెన్స్ తీసుకుని వచ్చారు.

అలెగ్జాండర్‌ని 'తన వెంట వస్తావా?' అని త్రివిక్రం అడగలేదు. స్ట్రెచర్‌లోకి ఆయన్ని ఎత్తి దాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కించారు.

"మీరెవరు? నన్ను ఎక్కడికి తీసుకెళ్తున్నారు?" ఆయన అడిగాడు.

"మంచి హాస్పిటల్‌కి" చెప్పాడు త్రివిక్రం.

"మీరెవరు? ఎందుకు నాకీ సహాయం చేస్తున్నారు?" మళ్ళీ అడిగాడు.

"మీ ఆరోగ్యం బావుండాలని వేలాంగిణి ప్రభువుని ప్రార్థిస్తోంది కాబట్టి, ప్రభువు పంపగా వచ్చిన మీ గార్డియన్ ఏంజెల్‌ని." నవ్వుతూ చెప్పాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in